తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం - 05- అక్టోబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 122 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in



# సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష

పెండింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు

భూ సేకరణ, పునరావాస అంశాలపై విస్తృత చర్చ

రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే లక్ష్యం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2లో

# కరువుపై ప్రత్యేక కేబినెట్ ఏర్పాటు చేయాలి: కవిత



- రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలి
- ప్రభుత్వ వైఫల్యాలపై కవిత విమర్శలు
- పేపర్ బ్యాలెట్ విధానం తీసుకురావాలని డిమాండ్
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కరువును ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వెంటనే ప్రత్యేక కేబినెట్ సమావేశం నిర్వహించి కరువు, రైతు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రమవుతున్నప్పటికీ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ రూపొందించలేదని ఆమె ఆరోపించారు. జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, దీనివల్ల భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోయాయని పేర్కొన్నారు.

మిగతా 2లో

# ఆడబిడ్డలపై ఆగని అకృత్యాలు



దేశవ్యాప్తంగా పెరుగుతున్న లైంగిక దాడుల ఘటనలు

భద్రాద్రి ఘటన మరోసారి కలకలం

చిన్నారుల భద్రతపై పెరుగుతున్న ఆందోళనలు

**డెస్క్, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశవ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపుల ఘటనలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో చిన్నారులు, యువతులు లైంగిక వేధింపులు, అత్యాచార యత్నాలకు గురవుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. కఠిన చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ నేరస్థుల్లో భయం కనిపించకపోవడం, సమాజంలో మహిళల భద్రతపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోంది. నగరాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ఇలాంటి ఘటనలు వరుసగా చోటుచేసుకోవడం తల్లిదండ్రుల్లో ఆందోళన పెంచుతోంది. ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బుడుగు బజార్‌లో చోటుచేసుకున్న ఘటన మరోసారి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. భద్రాచలంలో ఇంటర్ చదువుతున్న పదహారేళ్ల బాలిక బస్సు కోసం వేచి ఉండగా, తనకు తెలిసిన వ్యక్తి అయిన అరవై ఏళ్ల వృద్ధుడు ఇంటి వద్ద దింపుతానని చెప్పి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లాడు. అనంతరం నిర్మానుష్య ప్రాంతంలో వాహనాన్ని ఆపి బాలికపై లైంగిక దాడికి యత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. బాలిక ధైర్యంగా తప్పించుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఘటన వెలుగులోకి వచ్చింది.

మిగతా 8లో



# సిద్దిపేట పదేళ్ల పండుగకు ఘన సన్నాహాలు

- జిల్లా ఖ్యాతి దేశవ్యాప్తంగా చాటేలా వేడుకలు
- మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయం
- అన్ని వర్గాల భాగస్వామ్యంతో వేడుకలకు రూపకల్పన
- మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు

**సిద్దిపేట, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**

సిద్దిపేట జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో కవులు, కళాకారులు, జర్నలిస్టులు, వైద్యులు, న్యాయవాదులు, వ్యాపారులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజాసంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా ఖ్యాతి, కీర్తి ఎల్లలు దాటేలా పదేళ్ల పండుగను నిర్వహించాలని సూచించారు.

మిగతా 2లో

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెలంగాణ యువతి మృతి

- మహబూబాబాద్ జిల్లాకు చెందిన సుప్రియ దుర్మరణం
- ట్రక్ ఢీకొట్టడంతో ఘటన
- కుటుంబంలో విషాదం



**మహబూబాబాద్, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువతి మృతిచెందిన ఘటన విషాదాన్ని నింపింది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన దారం సుప్రియ (31) ఉద్యోగ రీత్యా అమెరికాలోని మిస్సోరి రాష్ట్రంలో నివాసం ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. అధికారుల వివరాల ప్రకారం సుప్రియ భారత్‌కు చెందిన మరో మహిళతో కలిసి ఆదివారం ఉదయం రెండు గంటల సమయంలో కారులో ప్రయాణం ప్రారంభించారు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్ వారి కారును బలంగా ఢీకొట్టింది.

మిగతా 2లో




# యువత ఉద్యోగార్థులు కాదు.. ఉద్యోగ కల్పనదారులు కావాలి

- క్రమశిక్షణ, నైతికత విజయానికి పునాది
- విద్యకు సామాజిక బాధ్యత జత కావాలి
- కర్నూలు కళాశాల వార్షికోత్సవంలో వెంకయ్య నాయుడు

**హైదరాబాద్, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**

యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూసే ఉద్యోగార్థులుగా కాకుండా, పదిమందికి ఉపాధి కల్పించే ఉద్యోగ కల్పనదారులుగా ఎదగాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన

మిగతా 2లో

# సకల జనుల సమ్మెపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

- ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు వినతి
- అరెస్టులు, ఆంక్షలపై అభ్యంతరం
- ఢిల్లీలో వినతిపత్రం సమర్పణ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ఉద్యమంలో కీలక ఘట్టంగా నిలిచిన సకల జనుల సమ్మె సందర్భంగా చోటుచేసుకున్న మానవ హక్కుల ఉల్లంఘనల అంశాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు వినతిపత్రం సమర్పించి, సమ్మె సమయంలో చేపట్టిన పోలీసు చర్యలపై విచారణ జరిపించాలని కోరారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష

**నల్గొండ, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలు, పెండింగ్ పనుల స్థితిగతులు, పూర్తి చేయాల్సిన లక్ష్యాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. రైతులకు సకాలంలో సాగునీరు అందేలా అన్ని ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రధానంగా భూసేకరణ ప్రక్రియపై విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూముల సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ ఆలస్యం వల్ల ప్రాజెక్టుల నిర్మాణ పనులు ప్రభావితం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

పునరావాసం, పునర్నిర్మాణ పరిహారానికి సంబంధించిన అంశాలు కూడా సమావేశంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారాన్ని నిబంధనల ప్రకారం వేగంగా అందించాలని, వారి సమస్యలను మానవీయ దృక్పథంతో పరిష్కరించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ప్రాజెక్టుల అభివృద్ధితో పాటు ప్రజల ప్రయోజనాలు కూడా సమానంగా పరిరక్షించబడాలని పేర్కొన్నారు. అటవీ శాఖ అనుమతులకు సంబంధించిన పెండింగ్ అంశాలను కూడా సమీక్షించారు. వివిధ ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులు త్వరగా పొందేందుకు శాఖల మధ్య సమన్వయం పెంచాలని అధికారులకు సూచించారు. పరిపాలనా, సాంకేతిక అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రాజెక్టులు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు ఫలితాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి, శాసన మండలి సభ్యుడు శంకర్ నాయక్, ప్రభుత్వ విప్‌లు, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ పనులు వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెలంగాణ యువతి మృతి

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా ధ్వంసమవగా, సుప్రియ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

ప్రమాదంలో కారులో ఉన్న మరో మహిళకు గాయాలయ్యాయి. ఆమెను సమీప వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను స్థానిక అధికారులు సేకరిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. సుప్రియ మృతి వార్త మహబూబాబాద్ జిల్లాలోని ఆమె కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. మృతురాలి భర్త కొదుమూరి రంజిత్, అత్తమామలు మహబూబాబాద్ పట్టణంలోని వీరభద్ర అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఉద్యోగ అవకాశాల కోసం విదేశాలకు వెళ్లిన సుప్రియ అనుకోని రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో బంధువులు, స్నేహితులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమె మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి కుటుంబ సభ్యులు ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. ఈ ఘటనపై స్థానిక ప్రజాప్రతినిధులు, పరిచయస్తులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు కుటుంబాల భద్రతపై మరోసారి చర్చకు దారితీసిన ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలో విషాద ఛాయలు నింపింది.

# యువత ఉద్యోగార్థులు కాదు.. ఉద్యోగ కల్పనదారులు కావాలి

(మొదటి పేజీ తరువాయి)



కర్నూలు సిల్వర్ జూబిలీ డిగ్రీ కళాశాల 2026 వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రమశిక్షణ, నైతిక విలువలకు నిలయంగా పేరుగాంచిన ఈ విద్యాసంస్థ ఎందరో మేధావులను దేశానికి అందించిందని పేర్కొన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న అనేక మంది విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించడం గర్వకారణమని వెంకయ్య నాయుడు అన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, విలువలు, క్రమశిక్షణను అందించిన ఈ విద్యాసంస్థ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యారంగానికి అందించిన గొప్ప కానుకగా నిలిచిందని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో విద్యాసంస్థల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

ఏ రంగంలోనైనా శాశ్వత విజయాన్ని సాధించాలంటే ఓర్పు, దీక్ష, నిరంతర కృషి అవసరమని ఆయన సూచించారు. కష్టపడకుండా విజయాలు సాధించాలనే ఆలోచన సరైనది కాదని, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాల్సిందేనని విద్యార్థులకు సూచించారు. యువత తమ సామర్థ్యాలను గుర్తించి కొత్త అవకాశాలను సృష్టించే దిశగా ముందుకు సాగాలని అన్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో పరిశ్రమల అవసరాలకు, విద్యా సంస్థల్లో బోధించే పాఠ్యాంశాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. విద్యార్థులు విద్య పూర్తి చేసిన తర్వాత ఉపాధి అవకాశాలు సులభంగా పొందేలా పాఠ్యాంశాలను కాలానుగుణంగా రూపొందించాలని సూచించారు. విద్య కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా జీవిత నైపుణ్యాలను పెంపొందించేలా ఉండాలని అభిప్రాయపడ్డారు.

ఉపాధ్యాయుల పాత్రపై కూడా ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించే వారిగానే కాకుండా విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేయాలని అన్నారు. మంచి గురువులే మంచి పౌరులను తయారు చేస్తారని పేర్కొన్నారు. సమాజంలో చదువుకున్న ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతను గుర్తించాలని వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. కేవలం సంపాదన ఒక్కటే జీవిత లక్ష్యం కాకూడదని, తాము నివసించే సమాజానికి, దేశానికి ఏమి తిరిగి ఇస్తున్నామనే ఆలోచన ప్రతి యువకుడిలో ఉండాలని అన్నారు. విద్య, విలువలు, సామాజిక బాధ్యత కలిసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ యువత దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

# కరువుపై ప్రత్యేక కేబినెట్ ఏర్పాటు చేయాలి: కవిత



(మొదటి పేజీ తరువాయి)

అనేక ప్రాంతాల్లో రైతులు పంటలను కాపాడుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారని, కొందరు పంటలను నాశనం చేసుకునే పరిస్థితులు కూడా ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఇంకా భారీ స్థాయిలో సాగు విస్తీర్ణం ఉన్నందున నవంబర్ వరకు రైతులకు ఇరవై నాలుగు గంటల ఉచిత త్రీఫేజ్ విద్యుత్ అందించాలని కవిత డిమాండ్ చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో ఆరు నుంచి ఏడు గంటల పాటు కూడా నిరంతర విద్యుత్ సరఫరా లేదని ఆరోపించారు. విద్యుత్ సరఫరా లోపంతో బోర్ల ద్వారా నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. కరువు మండలాలను వెంటనే ప్రకటించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరువు ప్రభావిత ప్రాంతాలను గుర్తించి చర్యలు ప్రారంభించాయని, తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ముందుకు సాగడం లేదని విమర్శించారు. కరువు మండలాల ప్రకటన ద్వారా కేంద్ర సహాయం పొందే అవకాశం ఉంటుందని చెప్పారు.

దక్షిణాది రాష్ట్రాల్లో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహాయ చర్యలు చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ఉత్పత్తి అధికంగా ఉన్న రాష్ట్రాల నుంచి దక్షిణాది రాష్ట్రాలకు విద్యుత్ అందించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. తెలంగాణకు కేంద్రం మరింత ఆర్థిక, సాంకేతిక సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్నికల వ్యవస్థపై కూడా కవిత స్పందించారు. దేశంలో మళ్లీ పేపర్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పారదర్శకత పెంచేందుకు ఇది అవసరమని పేర్కొంటూ, ఈ అంశంపై తమ పార్టీ జాతీయ స్థాయిలో పోరాటం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికలు వచ్చినా తమ పార్టీ పోటీ చేస్తుందని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# సకల జనుల సమ్మెపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

(మొదటి పేజీ తరువాయి)

సమ్మె ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో భారీ సంఖ్యలో అరెస్టులు, లాఠీచార్జీలు, బాష్పవాయువు ప్రయోగం, అత్యవసర సేవల నిర్వహణ చట్టం అమలు వంటి చర్యలు ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధంగా ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజాసంఘాల ప్రతినిధులపై తీసుకున్న చర్యలు మానవ హక్కుల ఉల్లంఘనలకు దారితీశాయని ఆరోపించారు.

ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, అలాంటి పరిస్థితుల్లో నిరసనకారులపై కఠిన చర్యలు చేపట్టడం ఆందోళనకరమని నాయకులు పేర్కొన్నారు. ఈ అంశంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ సహాధ్యక్షుడు, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్‌తో పాటు జేఏసీ నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, న్యాయవాదుల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చోటుచేసుకున్న పరిణామాలను కమిషన్‌కు వివరించారు.

సమ్మె సమయంలో జరిగిన పరిణామాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో సకల జనుల సమ్మె ఒక ముఖ్యమైన అధ్యాయమని, ఆ సమయంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలను వెలుగులోకి తీసుకురావడం అవసరమని నాయకులు అభిప్రాయపడ్డారు.




# సిద్దిపేట పదేళ్ల పండుగకు ఘన సన్నాహాలు

(మొదటి పేజీ తరువాయి)



సిద్దిపేట జిల్లా కోసం దశాబ్దాల పాటు సాగిన ఉద్యమం, ఆకాంక్షలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలని హరీశ్ రావు అన్నారు. 1983 నుంచే సిద్దిపేట జిల్లా డిమాండ్ ప్రజల్లో బలంగా ఉన్నప్పటికీ అది చాలా కాలం నినాదంగానే మిగిలిపోయిందని పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ 2016 అక్టోబర్ 11న సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేసి చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించారని అన్నారు. జిల్లా ఏర్పాటు ద్వారా ప్రజలకు పరిపాలన మరింత చేరువైందని పేర్కొన్నారు.

జిల్లా ఏర్పాటుకు ముందు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు, వ్యాపారులు, విద్యార్థులు వివిధ అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని గుర్తు చేశారు. జిల్లా ఏర్పడిన తర్వాత పరిపాలనా సౌకర్యాలు విస్తరించడంతో పాటు అభివృద్ధి వేగవంతమైందని చెప్పారు. గోదావరి జలాలు, రైల్వే సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి ఎన్నో అంశాలు సిద్దిపేట ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని వివరించారు. సిద్దిపేట జిల్లా పదేళ్ల ప్రస్థానాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని హరీశ్ రావు అన్నారు. జిల్లా చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, అభివృద్ధి, సాధించిన విజయాలను ప్రతిబింబించేలా ప్రత్యేక సావనీర్ రూపొందించాలని సూచించారు. అలాగే నాటి సిద్దిపేట, నేటి సిద్దిపేట అనే అంశంపై సమగ్ర డాక్యుమెంటరీ రూపొందించాలని ప్రతిపాదించారు. జిల్లా ఏర్పాటుతో వచ్చిన మార్పులను యువతకు పరిచయం చేయడం అవసరమని పేర్కొన్నారు.

అక్టోబర్ 11న జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ప్రత్యేక సభ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక, సాహిత్య, సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. జర్నలిస్టులు, కవులు, రచయితలు, వైద్యులు, న్యాయవాదులు, వ్యాపారవేత్తల ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి, సాధించిన ఫలితాలపై చర్చా వేదికలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ సూడా చైర్మన్ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గుండు భూపేష్‌తో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, జర్నలిస్టు, రచయిత, వైద్య, న్యాయవాది, వ్యాపార, విశ్రాంత ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సిద్దిపేట పదేళ్ల పండుగను ప్రజల పండుగగా మార్చి జిల్లా ఘనతను దేశానికి చాటాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
సోమవారం - 05- అక్టోబర్ 2026




## సామాజిక సేవలో రెడ్‌క్రాస్ కీలక పాత్ర

- **ఓటు హక్కు వినియోగించుకున్న ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**

**కరీంనగర్, అక్టోబర్ 4(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీ సభ్యుల ఎన్నికలు ఆదివారం ఉదయం ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆల్ఫోర్స్ డా. వి. నరేందర్ రెడ్డి పాల్గొని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.
ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో సహాయ సహకారాలు అందిస్తూ సామాజిక సేవలో రెడ్‌క్రాస్ సొసైటీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.
ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకమైన రెడ్‌క్రాస్ సొసైటీలో సభ్యత్వం పొందాలని, తద్వారా సొసైటీ అందించే వివిధ సేవలను వినియోగించుకోవడంతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.
ఎన్నికల సందర్భంగా పలువురు ప్రముఖులను నరేందర్ రెడ్డి కలుసుకుని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, సామాజిక అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు రెడ్‌క్రాస్ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కరీంనగర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలు

- **ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



**కరీంనగర్, అక్టోబర్ 4(తెలంగాణ ముచ్చట్లు ):** జిల్లా కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) కరీంనగర్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు ఉత్సాహంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి గంగుల కమలాకర్ పోలింగ్ కేంద్రానికి స్వయంగా చేరుకుని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించే నూతన పాలకవర్గం ఎంపిక కోసం జరుగుతున్న ఎన్నికలపై సభ్యుల్లో ఆసక్తి నెలకొంది.
పోలింగ్ ప్రక్రియలో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, రెడ్‌క్రాస్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.




## ఘనంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి జన్మదిన వేడుకలు

- **వలస వెళ్లినా వీడని అనుబంధం..**

**వనపర్తి,అక్టోబర్04(తెలంగాణ ముచ్చట్లు):** మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ రామంతపూర్‌లో బీఆర్ఎస్ యువ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు ఉద్యోగ, ఉపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. స్వగ్రామానికి దూరంగా ఉన్నప్పటికీ నిరంజన్ రెడ్డిపై ఉన్న అభిమానం మాత్రం చెక్కుచెదరలేదని, అందుకే ప్రతి సంవత్సరం ఆయన జన్మదినాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హయాంలో వనపర్తి ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, సాగునీరు, రహదారులు, విద్య, వైద్య రంగాల్లో జరిగిన అభివృద్ధి చిరస్మరణీయమని పేర్కొన్నారు. వనపర్తి జిల్లా ఏర్పాటుతో పాటు ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. నిరంజన్ రెడ్డి ఆయురారోగ్యాలతో మరిన్ని సంవత్సరాలు ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇరికిచెట్టి మధు, దయ్యాల జయరాజ్, చంద్రమోహన్, వెంకటగిరి శ్యామ్, కానాపురం శ్రీను, ఏర్పుల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది

- **త్వరలో ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి**
- **రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**వనపర్తి,అక్టోబర్04(తెలంగాణ ముచ్చట్లు):** ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఆటో డ్రైవర్లకు డిన్నర్ ఏర్పాటు చేసి వారి సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో ఆటో జేఏసీ చేస్తున్న కృషిని అభినందించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆటో మీటర్ చార్జీలను పెంచినట్లు తెలిపారు. త్వరలో కేబినెట్‌తో చర్చించి ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దయ్యాల దాసు మాట్లాడుతూ.. మీటర్ చార్జీల పెంపు, సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు తమ యూనియన్ పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు.కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఆటో జేఏసీ చైర్మన్ వేముల మారయ్య, కన్వీనర్ వెంకటేశం, ఐఎన్‌టీయూసీ నాయకులు నరసింహారెడ్డి, మల్లేష్ గౌడ్, నాగన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మీటర్ చార్జీల పెంపు, సంక్షేమ బోర్డుపై ప్రభుత్వ నిర్ణయానికి కృతజ్ఞతలు



- **తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దయ్యాల దాసు**

**వనపర్తి,అక్టోబర్04(తెలంగాణ ముచ్చట్లు):** ఆటో మీటర్ చార్జీల పెంపుతో పాటు త్వరలో ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వానికి తెలంగాణ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి దయ్యాల దాసు కృతజ్ఞతలు తెలిపారు.హైదరాబాద్ ప్రజాభవన్‌లో శనివారం రాత్రి ఆటో డ్రైవర్లతో నిర్వహించిన డిన్నర్ కార్యక్రమంలో పాల్గొన్న దయ్యాల దాసు మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో మీటర్ చార్జీల పెంపుపై సానుకూల నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు.అలాగే ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు దిశగా కృషి చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుతో ఆటో డ్రైవర్లు, వారి కుటుంబాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టే చర్యలకు తమ యూనియన్ తరఫున పూర్తి సహకారం అందిస్తామని దయ్యాల దాసు తెలిపారు.

## దొడగుంటపల్లిలో కుక్కల బెడద

- **గుంపులుగా సంచారం.. చిన్నారులు, వృద్ధులకు తీవ్ర ఇబ్బందులు**

**పెద్దమందడి,అక్టోబర్04(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామంలో కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో వందకు పైగా కుక్కలు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.కుక్కలు చిన్నారులను వెంబడించడంతో పాటు పలువురిని కరిచిన ఘటనలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు తెలిపారు. వృద్ధులు, మహిళలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులను కుక్కలు వెంబడిస్తుండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందన్నారు.కుక్కల సమస్యను గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు, యువజన సంఘాల సభ్యుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కేవలం ఫిర్యాదులకు పరిమితం కాకుండా సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టి కుక్కల నియంత్రణకు తగిన ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.చిన్నారులు, వృద్ధుల భద్రతకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో అధికారులు ఇక ఆలస్యం చేయకుండా అత్యవసర చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామసభలో ఈ సమస్యపై ప్రత్యేకంగా చర్చించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామ పెద్దలు, యువత కూడా అధికారులకు సహకరించి సమస్య పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు.



## ఏఐఎస్ఎఫ్‌లో విద్యార్థుల చేరిక

- ***విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడి పిలుపు***

**కరీంనగర్, అక్టోబర్ 4(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ నగరంలోని బొమ్మకల్, జ్యోతినగర్, కిసాన్‌నగర్, మారుతినగర్ ప్రాంతాలకు చెందిన పలువురు విద్యార్థులు ఈరోజు ఏఐఎస్ఎఫ్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంట రెడ్డి నూతనంగా చేరిన విద్యార్థులకు కండువాలు కప్పి, సభ్యత్వం అందజేసి ఏఐఎస్ఎఫ్‌లోకి సాదరంగా ఆహ్వానించారు.
ఈ సందర్భంగా మణికంట రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణతో పాటు విద్యా రంగంలోని సమస్యలపై ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.
విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఏఐఎస్ఎఫ్‌లో చేరి విద్యార్థి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, నూతనంగా చేరిన విద్యార్థులు పాల్గొన్నారు.



## గ్రాడ్యుయేట్ల ఓటు నమోదుకు విస్తృతంగా అవగాహన

- **అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఫారం-18తో నమోదు చేసుకోవాలి**
- **పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**



**శ్రీరంగాపూర్,అక్టోబర్04(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రాడ్యుయేట్లు ఫారం18 దరఖాస్తులను పూర్తి చేసి తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ.. 2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రతి గ్రాడ్యుయేట్ ముందుకు రావాలని కోరారు. ఫారం18 దరఖాస్తుతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. పట్టభద్రులు తమ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండటంతో పాటు తోటి గ్రాడ్యుయేట్లకు కూడా సమాచారం అందించాలని కోరారు.శ్రీరంగాపూర్ మండలంలోని యువత, ఉపాధ్యాయులు, పట్టభద్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శంకర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. వనపర్తి జిల్లాలో అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు నమోదు చేయించడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పృథ్వీరాజ్, మండల నాయకులు వెంకటస్వామి, షఫీ, సయ్యద్, శ్రీనివాస గౌడ్, కృష్ణయ్య, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# త్రైక్వాండోలో కొత్తకోట విద్యార్థుల సత్తా

- ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు 10 మంది ఎంపిక

**వనపర్తి,అక్టోబర్04(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా కేంద్రంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి త్రైక్వాండో మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో కొత్తకోట విద్యార్థులు ప్రతిభ చాటారు. కొత్తకోట పట్టణంతో పాటు అగ్రహారం, మోజర్ల, కనిమెట్ట ప్రాంతాలకు చెందిన దాదాపు 10 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శనతో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఎంపికైన విద్యార్థులు ఈ నెల 8న గద్వాలలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ పోటీల్లో వనపర్తి జిల్లా తరఫున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను పలువురు అభినందించారు. విద్యార్థులను వారి కోచ్‌లు శివశంకర్, పరశురాముడు, రవితో పాటు వనపర్తి త్రైక్వాండో అసోసియేషన్ సీనియర్ మాస్టర్లు పెంటన్న యాదవ్, నరేంద్ర సాగర్, శ్రీను యాదవ్, నరేష్ నాయుడు, రమేష్ రెడ్డి, యాదగిరి, శివయ్య, మాధవ్ నాయుడు అభినందించారు. గద్వాలలో జరిగే పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు బతుకమ్మ, దసరా పండుగలు

- బతుకమ్మ, దసరా శుభాకాంక్షల పోస్టర్ ఆవిష్కరణ

**వరంగల్, అక్టోబర్ 04 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, దసరా పండుగలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలు ఘనంగా జరుపుకుంటున్న సందర్భంగా ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన బతుకమ్మ, దసరా ఉత్సవాల ప్రారంభోత్సవ శుభాకాంక్షల పోస్టర్‌ను భారత ప్రభుత్వ ల్యాండ్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్ జాయింట్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి ఐఏఎస్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పరికిపండ్ల నరహరి ఐఏఎస్ మాట్లాడుతూ.. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆడపడుచులతో పాటు ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మసేతు గ్లోబల్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీకాంత్ అనగంటి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐకమత్యంతో జీవించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ఓబిసి ప్రధాన కార్యదర్శి, బొజ్జపల్లి సుభాష్, గాజుల సంపత్ కుమార్, పరికిపండ్ల రాము తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

# గ్యాస్ దుర్వాసనపై ప్రభుత్వం ఎందుకు మౌనం?

- సూరారం ప్రజల అవస్థలు.. అధికారుల స్పందన ఎక్కడ?

**ఎల్కతుర్తి, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామ ప్రజలు గ్యాస్ దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న రిలయన్స్ గ్యాస్ ప్రాంతం నుంచి విపరీతమైన దుర్వాసన వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో దుర్వాసన మరింత తీవ్రంగా ఉంటోందని, సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

**దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి.. ప్రభుత్వం స్పందించేదెప్పుడు?**

గ్యాస్ దుర్వాసన గాలిలో వ్యాపించడంతో గ్రామంలోని ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇళ్ల తలుపులు, కిటికీలు మూసుకున్నప్పటికీ దుర్వాసన నుంచి ఉపశమనం లభించడం లేదని పేర్కొంటున్నారు. ఇంట్లో ఉండాలన్నా, బయటకు వెళ్లాలన్నా ఇబ్బందికర పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వృద్ధులు, చిన్నారులకు ఇబ్బందులు.. పట్టించుకునేదెవరు?**

దుర్వాసన కారణంగా ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు. దగ్గు, తుమ్ములు, ఆయాసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించిన సమస్యగా దీనిని పరిగణించి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**రాత్రివేళల్లో తీవ్ర దుర్వాసన.. అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?**

రాత్రి వేళల్లో గ్యాస్ దుర్వాసన మరింత తీవ్రంగా ఉంటోందని గ్రామస్తులు చెబుతున్నారు. దుర్వాసన ఇళ్ల వరకు చేరడంతో ప్రజలు ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారని తెలిపారు. సమస్య తీవ్రతను గుర్తించి అధికారులు రాత్రి సమయంలోనూ పరిస్థితిని పరిశీలించాలని కోరుతున్నారు.

**ఇళ్లలో ఉండలేని దుస్థితి.. ప్రభుత్వ చర్యలు ఎక్కడ?**

విపరీతమైన దుర్వాసన కారణంగా కొన్నిసార్లు ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ జీవనంపై కూడా ఈ సమస్య ప్రభావం చూపుతోందని తెలిపారు. ఇంతటి ఇబ్బంది ఉన్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల ఆరోగ్యంపై ఆందోళన.. బాధ్యత ఎవరిది?**

గ్యాస్ దుర్వాసనకు అసలు కారణం ఏమిటన్నది స్పష్టంగా తెలియకపోవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. దుర్వాసనకు కారణాలను శాస్త్రీయంగా, సాంకేతికంగా పరిశీలించి ప్రజలకు వాస్తవ పరిస్థితిని అధికారులు వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**అధికారులు గ్రామాన్ని సందర్శించేదెప్పుడు?***

సంబంధిత శాఖల అధికారులు సూరారం గ్రామాన్ని తక్షణమే సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్యాస్ ప్రాంతం నుంచి వెలువడుతున్న దుర్వాసనకు కారణాలను గుర్తించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి**

గ్యాస్ దుర్వాసనకు కారణమవుతున్న అంశాలను గుర్తించి, ప్రజల ఆరోగ్య భద్రతకు ఎలాంటి ముప్పు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అవసరమైతే సంబంధిత కార్యకలాపాలను తాత్కాలికంగా నియంత్రించి, సమస్య పూర్తిగా పరిష్కరించే వరకు అధికారులు పర్యవేక్షణ కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు



**ఇకనైనా స్పందించి సూరారం ప్రజలకు ఉపశమనం కల్పించాలి**

ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూరారాం గ్రామ ప్రజలు కోరుతున్నారు. గ్యాస్ దుర్వాసనకు అసలు కారణాలను గుర్తించి, శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# ముల్కనూర్ అథ్లెట్లకు పతకాల పంట

- జిల్లా స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు

**భీమదేవరపల్లి, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో అక్టోబర్ 1న నిర్వహించిన సబ్ జూనియర్ అథ్లెటిక్స్ జిల్లా స్థాయి పోటీల్లో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. కోచ్ ఎల్. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు మొత్తం 10 పతకాలు సాధించి ప్రతిభను చాటారు.




**పతకాలు సాధించిన క్రీడాకారులు:**

1. పీ. సిద్ధార్థ్ (U10) - లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, బంగారు పతకం; 60 మీటర్ల పరుగు ప్రథమ స్థానం, బంగారు పతకం
2. కే. రామ్‌చరణ్ (U10) - 200 మీటర్ల పరుగు ప్రథమ స్థానం, బంగారు పతకం; లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం, కాంస్య పతకం
3. ఎస్. కృతిక (U10) - 200 మీటర్ల పరుగు ద్వితీయ స్థానం, వెండి పతకం; లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం, కాంస్య పతకం
4. జే. అలేఖ్య (U12) - కిడ్స్ జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానం, వెండి పతకం; లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం, కాంస్య పతకం; 60 మీటర్ల పరుగు తృతీయ స్థానం, కాంస్య పతకం
5. డీ. సాయినాథ్ (U12) - లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం, కాంస్య పతకం

పతకాలు సాధించిన క్రీడాకారులను ముల్కనూర్ గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, వార్డు సభ్యుడు చంద్రమౌళితో పాటు పలువురు అభినందించారు. అక్టోబర్ 11న ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు క్రీడాకారులను ప్రోత్సహించారు.

క్రీడాకారుల విజయంపై కోచ్ ఎల్. విజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

# ఎలక్ట్రికల్ వ్యాపారుల ఏకగ్రీవ తీర్పు.. అంజయ్యకే అధ్యక్ష పీఠం

**జమ్మికుంట, అక్టోబర్ 04 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట పట్టణంలోని ఎలక్ట్రికల్ వ్యాపారుల ఐక్యతకు మరోసారి మద్దతు లభించింది. పట్టణంలో సుమారు 39 ఎలక్ట్రికల్ షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులు తమ సంఘం అధ్యక్షుడిగా పొన్నగంటి అంజయ్యను మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రతి ఏడాది ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకుంటుండటం వ్యాపారుల్లో ఆయనపై ఉన్న నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఈ సందర్భంగా అధ్యక్షుడు పొన్నగంటి అంజయ్య మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ షాపుల యజమానులు, వ్యాపారస్తులకు ఎలాంటి ఆపద లేదా సమస్య ఎదురైనా ముందుండి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వ్యాపారుల సమస్యలను తమ కుటుంబ సమస్యలుగా భావించి వారికి అండగా నిలుస్తానన్నారు. తనపై నమ్మకంతో మరోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ఎలక్ట్రికల్ వ్యాపారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



సంఘం నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా శీలం జయప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా శీలం రవీందర్, కోశాధికారిగా మురికి అరవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని గుత్తి ప్రతాప్, రమణారెడ్డి, మురికి సాయిరాం, నాగయ్య, నరేందర్ రెడ్డి తదితరులు అభినందించారు.



# శ్యామ్ కుటుంబానికి పీఎంకే ఫౌండేషన్ ఆపన్నహస్తం

**జమ్మికుంట, అక్టోబర్ 04 (తెలంగాణ ముచ్చట్లు):**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన కోరపల్లి గ్రామానికి చెందిన గిరవేణ శ్యామ్ కుటుంబానికి పీఎంకే ఫౌండేషన్ అండగా నిలిచింది. శ్యామ్ మృతితో విషాదంలో ఉన్న కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందించింది.

ఇటీవల జమ్మికుంట పట్టణంలోని ఎఫ్‌సీఐ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గిరవేణ శ్యామ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పీఎంకే ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ శ్యామ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు ఫౌండేషన్ నిర్వాహకులు కోరపల్లిలోని శ్యామ్ కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ శ్యామ్ కుటుంబానికి భవిష్యత్తులోనూ తమవంతు సహకారం అందిస్తూ అండగా ఉంటామని తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు తోడుగా నిలవడమే ఫౌండేషన్ లక్ష్యమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె రవిగౌడ్, మోగు దెబ్బ గౌడ్ సంఘం అధ్యక్షుడు రంజిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


# పోడు భూముల సమస్యలపై త్వరలో తీపి కబురు..

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్రాభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తా
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు..పార్టీ ఆధ్వర్యంలో విస్తృతంగా కృషి చేయాలి
- లక్ష్మీదేవిపల్లి మండల పార్టీ శ్రేణుల విస్తృత సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 4(తెలంగాణ ముచ్చట్లు )**



తరతరాలుగా పోడు కొట్టుకుంటూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారికి.. పోడు భూముల సమస్యల పరిష్కారంపై త్వరలోనే తీపి కబురు చెబుతానని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఆదివారం లక్ష్మీదేవి పల్లి మండలం రేగళ్లలో జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశంలో ప్రసంగించారు. అటవీ భూములకు సంబంధించి.. కొన్ని అంశాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నాయని, కేంద్రంతో సంప్రదించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం..**

గత తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో పేదలను పట్టించుకోలేదని, గళ మెత్తిన నిరుద్యోగులను ఉరికించి కొట్టారని.. 33 నెలల మా ప్రజా ప్రభుత్వ పాలనలో రైతు రుణమాఫీ, రైతు భరోసా, క్వింటాకు రూ.500 బోనస్, మహిళలకు ఉచిత బస్సు ప్రాయాణం, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఉద్యోగులకు నోటిఫికేషన్లతో ప్రజా సంక్షేమ పథకాల తో ముందుకు సాగుతున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాం లో..పేదలకు ఇళ్లిస్తే కమిషన్లు రావని.. లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టి ఇష్టం వచ్చినట్లు దోచుకోగా.. వారు అధికారంలో ఉన్నప్పుడే అది కూలే పరిస్థితి వచ్చిందని విమర్శించారు.

**అన్నిగ్రామాలకు నిధులిస్తా..**

ఖమ్మం జిల్లాతో పాటు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అన్ని గ్రామాలకు నిధులను కేటాయించి, మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను మూడు, అవసరమైతే నాలుగో విడతలో కూడా మంజూరు చేస్తామని, రాజకీయాలకు అతీతంగా పేదలకు కేటాయిస్తామని వెల్లడించారు. హైదరాబాదులోని పేదలు వారు పనిచేసే ప్రాంతాల్లోనే .. ఖరీదైన భూముల్లో అపార్ట్‌మెంట్లు కట్టించి ఇస్తున్నామని.. ఒక్కొక్కరికీ రూ.కోటి విలువ చేసే ఇల్లు దక్కుతోందని అన్నారు.

**ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి.**

ఖమ్మం, నల్లగొండ, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో.. కాంగ్రెస్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బృందాలుగా గ్రామ, మండల స్థాయిలో విస్తృతంగా పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో.. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, సీనియర్ నాయకులు నాగా సీతారాములు, ఆళ్ల మురళి, గోపాలరావు, మండల అధ్యక్షులు ప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.




## ముల్కనూర్ మొబైల్ షాప్ యూనియన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**భీమదేవరపల్లి, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామ మొబైల్ షాప్ యూనియన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లహరి సెల్ పాయింట్ యజమాని గౌడ చంద్రబాబు, కోశాధికారిగా శ్రీ సాయి సెల్ వరల్డ్ యజమాని సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గౌడ చంద్రబాబు మాట్లాడుతూ మొబైల్ షాప్ యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వ్యాపార అభివృద్ధికి తోడ్పాటునందిస్తూ యూనియన్‌ను ఐక్యంగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పోతుగంటి రవీందర్, రాజు, నాగా సెల్ పాయింట్ నిర్వాహకులు, దేవి మొబైల్స్ ప్రవీణ్, మిల్కూరి రాజకుమార్, మంచికట్ల రాజేష్, నవాజ్ పాయింట్, వినోద్, చేలిపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.



## టైరు పేలడంతో ఓమినీ బోల్తా

- ఐదుగురికి తీవ్ర గాయాలు.. మరో నలుగురికి స్వల్ప గాయాలు

**హుజూరాబాద్, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**



హుజూరాబాద్ పట్టణ శివారులోని పెద్దపాపయ్యపల్లి వద్ద జాతీయ రహదారి 563 (కరీంనగర్-వరంగల్)పై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కూలీలతో వెళ్తున్న ఓమినీ వ్యాన్ వెనుక టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో వాహనం అదుపుతప్పి సమీపంలోని పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది.

**కరీంనగర్ వైపు వెళ్తుండగా ప్రమాదం**

హనుమకొండ జిల్లా కొత్తూరు జెండా ప్రాంతానికి చెందిన కూలీలు పనుల నిమిత్తం ఓమినీ వ్యాన్‌లో కరీంనగర్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మార్గమధ్యంలో వ్యాన్ వెనుక టైరు ఒక్కసారిగా పేలిపోవడంతో వాహనం అదుపుతప్పింది. వేగంగా పొలాల్లోకి దూసుకెళ్లిన వ్యాన్ బోల్తా పడింది.

**ఐదుగురికి తీవ్ర గాయాలు**

ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న వారిలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా, మరో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంతో స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను వాహనం నుంచి బయటకు తీసేందుకు సహాయపడ్డారు.

**108లో ఏరియా ఆసుపత్రికి తరలింపు**

సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి రిఫర్ చేశారు.

**పోలీసుల కేసు నమోదు**

ప్రమాద సమాచారం అందుకున్న హుజూరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.




## పెద్దమందడిలో ఘనంగా సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**పెద్దమందడి,అక్టోబర్ 04 (తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఆయన ప్రజలకు అందించిన సేవలను, తెలంగాణ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.ముఖ్యంగా వనపర్తి జిల్లా అభివృద్ధిలో సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చేసిన కృషి, ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను నాయకులు కొనియాడారు. వనపర్తి ప్రాంత అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన చేసిన ప్రయత్నాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని, భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత సేవ చేయాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కామంచికల్ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన మంత్రి పొంగులేటి

- తీర్థాలలో మూడు కుటుంబాలకు పరామర్శ

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు )**




ఇటీవల వ్యవసాయ కూలి పనులకు వెళ్లి వస్తుండగా.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కామంచికల్ గ్రామానికి చెందిన దొంతుసరుపు భారతమ్మ నివాసానికి వెళ్లి రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే...ఆ ప్రమాదంలో గాయపడిన మరో 11 మంది కూలీలకు రూ. 5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులోనూ ఈ కుటుంబాలకు తన వంతు సహకారం అందిస్తూ.. ఉండగా నిలుస్తానని అభయం ఇచ్చారు.

*తీర్థాల గ్రామంలో: ఇటీవలి కాలంలో వివిధ కారణాలతో చనిపోయిన బానోత్ శాంత, ఎస్ కే. అశ్వాన్, శీతల నాగరాజు ఇళ్లకు వెళ్లి.. వారి చిత్రపటాల వద్ద మంత్రి పొంగులేటి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఈ కార్యక్రమాల్లో.. కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోట వీరభద్రం, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు ప్రతాపనేని రఘు, బోడా వెంకన్న, కిరణ్ కుమార్ నాయక్, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



## చిట్టెమ్మకు ఘన నివాళులర్పించిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 4(తెలంగాణ ముచ్చట్లు )**

మాజీ జెడ్పిటిసి అంకిరెడ్డి కృష్ణారెడ్డి మాతృమూర్తి, తమ సమీప బంధువు అయిన అంకిరెడ్డి చిట్టెమ్మ మరణించగా... రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లి ఘన నివాళులు అర్పించారు. చిట్టెమ్మ గారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ.. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## 216 మందికి రూ.1.02 కోట్ల సాయం

- కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు )**




పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు.ఖమ్మం రూరల్ మండలంలో 51 మంది లబ్ధిదారులకు రూ.50,05,500 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అలాగే ఏదులాపురం మున్సిపాలిటీలో 70 మంది సీఎం ఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.23,66,500, ఖమ్మం రూరల్ మండలంలో 95 మందికి రూ.28,79,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు.కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ పథకాల ద్వారా మొత్తం 216 మంది లబ్ధిదారులకు రూ.1,02,51,000 మేర ఆర్థిక సాయం అందింది. సీఎంఆర్ఎఫ్ కిందనే 165 మందికి రూ.52,45,500 విలువైన చెక్కులు పంపిణీ చేయగా.. వారంతా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ..* కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య చికిత్స పొందిన పేదలు, మధ్యతరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని, గత పాలకుల కంటే రెండు మూడు రెట్లు ప్రజలకు లబ్ధి కలిగేలా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని వివరించారు.

ఈ కార్యక్రమంలో.. మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు తోట వీరభద్రం, ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ స్విమ్మింగ్ ఎంపికలు విజయవంతం

- 120 మంది విద్యార్థుల ఉత్సాహంగా పాల్గొన్నారు

**జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**




70వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో అండర్14, అండర్17 బాల బాలికల ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని సింగరేణి అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు.ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు ఈ ఎంపిక పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. వివిధ విభాగాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యేందుకు పోటీపడ్డారు.ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎల్. జైపాల్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను ఎంపిక చేసి, త్వరలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. రమేష్, కోటి రమేష్, సతీష్, అన్వర్, సమ్మయ్య, కోచ్‌లు శ్రీనివాస్, నవీన్, సింగరేణి స్పోర్ట్స్ ఆఫీసర్ పరస శ్రీనివాస్ తదితరులు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వార్డు సభ్యుల ఫోరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నాగబండి సంతోష్

**స్టేషన్ ఘనపూర్,అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నాగబండి సంతోష్ నియమితులయ్యారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టారు.

జనగామ జిల్లా వార్డు మెంబర్స్ ఫోరం ఇన్‌ఛార్జి గుండేటి రాంచందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సంతోష్‌ను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈ సందర్భంగా నాగబండి సంతోష్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ఫోరం రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ బొల్లం అవినాష్, ఎస్టీ విభాగం జిల్లా నాయకులు భూక్యా ఎం.జి. నాయక్, స్టేషన్ ఘనపూర్ మండల ఇన్‌ఛార్జి గుండె లక్ష్మణ్, రాజు, గోరంతల వెంకటేష్, జీడి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



# తాటికొండలో బీసీ మేధోమథనం

- **ప్రముఖ వైద్యుడికి ఆహ్వానం**

**స్టేషన్ ఘనపూర్,అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**

ఈ నెల 11న జనగామలో నిర్వహించనున్న బీసీ ఇంటలెక్చువల్ ఫోరం సదస్సును విజయవంతం చేయాలని ఫోరం నాయకులు పిలుపునిచ్చారు. స్టేషన్ ఘనపూర్ మండలం తాటికొండ గ్రామంలో శనివారం ప్రముఖ వైద్యుడు డాక్టర్ కె. శ్రావణ్ కుమార్ను ఫోరం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సదస్సుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సదస్సు ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఫోరం జిల్లా అధ్యక్షుడు గద్ద అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీల సామాజిక, విద్యా, రాజకీయ అభ్యున్నతిపై సదస్సులో కీలకంగా చర్చించనున్నట్లు తెలిపారు. బీసీల అభివృద్ధికి అవసరమైన భవిష్యత్ కార్యాచరణపై మేధావులు, విద్యావేత్తలు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

బీసీ మేధావులు, విద్యావేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి మారగోని సిద్దయ్య గౌడ్, నాయకులు ప్రభాకర్, ఉమ్మగోని రాజు గౌడ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.




# విశ్వకర్మల సత్తా చాటాలి.. ఇక తగ్గేదేలే!

- **ఘనపూర్ గడ్డపై గర్జించిన రాష్ట్ర అధ్యక్షుడు బిక్షపతి**

**స్టేషన్ ఘనపూర్,అక్టోబర్4 (తెలంగాణ ముచ్చట్లు):**

ఇన్నాళ్లు వృత్తికే పరిమితమయ్యామని, ఇక అన్ని రంగాల్లో విశ్వబ్రాహ్మణుల సత్తా చాటాలని విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు బిక్షపతి పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో విశ్వకర్మలు ముందుకు సాగాలని అన్నారు.

స్టేషన్ ఘనపూర్ పట్టణంలోని శివునిపల్లిలో ఆదివారం నిర్వహించిన మండల కమిటీ ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. విశ్వకర్మల్లో ఐక్యత లేకపోవడం వల్లే వెనుకబడ్డామని, ఇకనైనా ఐక్యంగా ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.సిరికొండ కుమారస్వామి అధ్యక్షతన, జిల్లా అధ్యక్షుడు దిగోజు నర్సింహాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షుడిగా మారేడుపాక ఉమాశంకర్, అధ్యక్షుడిగా కాసోజు రవీందర్, కార్యదర్శిగా మారేడుపాక రాజు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. విశ్వకర్మల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు.

కార్యక్రమంలో మొగుదుంపురం కిషోర్, కేశోజు అమర్, చెక్కపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 4(తెలంగాణ ముచ్చట్లు )**



ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను హెచ్చరించారు. ఆదివారం ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని వాసిరెడ్డి ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడూతూ, అధికారులు బాధ్యతగా, జవాబుదారీతనంతో ప్రజలకు సేవ చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. త్రాగునీటి సమస్య వస్తే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మధిర నియోజకవర్గంలో 9 స్కూళ్లను ఆధునికీకరించి అన్ని సదుపాయాలతో మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దాలని 59 కోట్ల 67 లక్షల రూపాయలను మంజూరు చేశామని, ఆధునికీకరణ, సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేసి, విద్యార్థులకు త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు.

రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బ్రిడ్జిల నిర్మాణ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా పూర్తి చేసి రవాణా సౌకర్యాన్ని సులభతరం చేయాలన్నారు. బ్రిడ్జిల నిర్మాణం ఆలస్యమైతే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో మధిర పట్టణంలోని 10,000 మంది మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి, స్వయం ఉపాధి కల్పించేలా నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న పనుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తే, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు.

రహదారుల విస్తరణ, వివిధ అభివృద్ధి పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు పనులు వేగంగా సాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్తంభాల తొలగింపు పనులతో అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు.

భూ రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రజా ఫిర్యాదులకు తావులేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం అన్నారు. రిసర్వే ప్రక్రియ తర్వాత రికార్డుల నమోదు జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు గడువులోగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని డిప్యూటీ సీఎం దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు టీ. మధుసూదన్, వీ. మోహన్ రావు, సి ఈ గౌతం రెడ్డి, ఎస్ ఈ శ్రీనివాసా చారి, పీఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, తహశీల్దార్ సునీత ఎలిజబెత్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాటం

- **ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కమిటీలు ఏర్పాటు**

**వరంగల్, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**



సమాజంలో ప్రతి ఒక్కరి మానవ హక్కులను పరిరక్షించడంతో పాటు పేదలు, మహిళలు, చిన్నారులకు జరుగుతున్న అన్యాయాలపై నిరంతరం పోరాడుతామని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సంస్థ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ మెరుగు రమేష్ ఆదేశాల మేరకు ఆదివారం వరంగల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ, వరంగల్ జిల్లాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేశారు.కార్యక్రమానికి హైకోర్టు అడ్వకేట్, హ్యూమన్ రైట్స్ అడ్వకేసీ అడ్వైజర్ వ్యవస్థాపకులు సత్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోమండ్ల శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బండి సదానందం, మెరుగు రాంబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి చేరేలా సంస్థ తరపున కృషి చేస్తామన్నారు. పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులతో పాటు మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, అన్యాయాలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు.రాష్ట్ర అధ్యక్షుడు కోమండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం, ప్రజలకు మధ్య అనుసంధానంగా పనిచేస్తూ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ అవినీతి నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బండి సదానందం మాట్లాడుతూ.. నూతన కమిటీ సభ్యులు సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. పేదలు, మహిళలు, చిన్నారులకు ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించేందుకు కమిటీ సభ్యులు ముందుండాలని పిలుపునిచ్చారు.

**నూతన కమిటీలు ఏర్పాటు**

హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా కీర్తి సురేష్, ఉపాధ్యక్షులుగా సీత దుర్గాప్రసాద్, శైలం బాలరాజు, ప్రధాన కార్యదర్శులుగా రేసు మధు, బత్తిని జీవన్, కార్యదర్శులుగా శంకర్ ఠాగూర్, కాలేరు వికాస్, బొజ్జ శ్రీకాంత్ నియమితులయ్యారు.వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా మచిక రవీందర్, ఉపాధ్యక్షుడిగా కొమ్ముల దిలీప్, ప్రధాన కార్యదర్శిగా వేములపల్లి సునీత, కార్యదర్శిగా పల్నాటి మూర్తి నియమితులయ్యారు.

నూతన జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. మానవ హక్కులతో పాటు మహిళలు, చిన్నారుల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా ప్రజలకు సేవలందిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో మానవ హక్కుల పరిరక్షణ కోసం మరింత చురుగ్గా పనిచేస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎద్దు రాజు, కేతనబోయిన నాగరాజు, కనుకుంట్ల దిలీప్, పున్నం చందర్, శెట్టి రమేష్, నగేష్, గడల రమేష్, బుర్రి విజయ్ కుమార్, పల్లబోయిన మురళీకృష్ణ, ప్రతాప్ రెడ్డి, సునీల్ కుమార్, చల్లగురుగుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం

**హనుమకొండ, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**




గిరిజనుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం రాబోయే రోజుల్లో మరిన్ని పోరాటాలు చేపడతామని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వి. వీరన్న నాయక్ తెలిపారు. తెలంగాణ గిరిజన సంఘం హనుమకొండ జిల్లా మూడో మహాసభను శనివారం హనుమకొండ గిరిజన భవన్ ప్రాంతంలో నిర్వహించారు.

బి. లాలు నాయక్, జగన్ నాయక్, సారయ్య, రమేష్ అధ్యక్షతన జరిగిన మహాసభకు వి. వీరన్న నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హనుమకొండ జిల్లాలో నివసిస్తున్న బంజారా, ఎరుకల తదితర గిరిజనుల హక్కులను కాపాడాలని ప్రభుత్వాలను కోరారు. గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చొరవ చూపాలని డిమాండ్ చేశారు.గిరిజన రిజర్వేషన్లను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలని, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసి నియామకాలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నేపథ్యంలో ప్రైవేట్ రంగంలోనూ గిరిజన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బంజారాలు మాట్లాడే గోర్బోలి భాషకు గుర్తింపు కల్పించి రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని మహాసభలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పట్టణ ప్రాంతాలకు వలస వస్తున్న లంబాడి, ఎరుకల గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు కల్పించడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు, ఆన్‌లైన్ కోచింగ్ ద్వారా శిక్షణ అందించి ఆర్థిక సహకారం కల్పించాలని అన్నారు. గిరిజన హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి కల్పించడంతో పాటు సిబ్బంది సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు.ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి తగినంత సిబ్బందిని నియమించాలని, కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న గిరిజన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

హనుమకొండ పట్టణంలోని గిరిజన నిరుద్యోగులకు ఐటీడీఏ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రుణాలు మంజూరు చేయాలని, జిల్లా యూనిట్‌గా తీసుకుని రుణాల కేటాయింపు చేపట్టాలని కోరారు. శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి, తీజ్ పండుగ ఉత్సవాల నిర్వహణ కోసం హనుమకొండలో భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని మహాసభ విజ్ఞప్తి చేసింది.

గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు రాబోయే రోజుల్లో ఐక్యంగా పోరాటాలు నిర్వహిస్తామని నాయకులు తెలిపారు.ఈ మహాసభలో నాయకులు బోనార్తి రవి, ఆర్. సారయ్య, భూక్య సునీల్, గుగులోత్ విజయ్, లావుడియా రాఘవ, అజ్మీర దినేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

- కుటుంబ పోషణ కష్టంగా ఉంది
- కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి: సీపీఐయూ డిమాండ్

హుజూరాబాద్, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):



గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వారికి కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐయూ నాయకులు డిమాండ్ చేశారు. హుజూరాబాద్‌లోని సీపీఐయూ కార్యాలయంలో ఆదివారం గ్రామపంచాయతీ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వేతనాల పెంపు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

**2019 నుంచి వేతనాల పెంపు లేదు**

గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు 2019 సంవత్సరం నుంచి వేతనాలు పెరగలేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కేవలం రూ.9,500తో కుటుంబాలను పోషించుకోవడం అత్యంత కష్టంగా మారిందని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్య, వైద్యం, ఇంటి ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో తక్కువ వేతనాలతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**కనీస వేతనం అమలు చేయాలి**

గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం, వీధుల పరిశుభ్రత, ఇతర ప్రజా సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీపీఐయూ నాయకులు డిమాండ్ చేశారు. సంవత్సరాల తరబడి సేవలందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే వేతనాలను పెంచి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

**మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి**

గ్రామపంచాయతీ కార్మికులపై అదనపు పనిభారం మోపుతున్న మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒకే కార్మికుడితో అనేక రకాల పనులు చేయించడం వల్ల పని ఒత్తిడి పెరుగుతోందని, దీనివల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఉద్యోగ భద్రత కల్పించాలి**

గ్రామపంచాయతీ కార్మికులకు పూర్తి స్థాయిలో ఉద్యోగ భద్రత కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా గ్రామాల్లో సేవలు అందిస్తున్న కార్మికుల భవిష్యత్తుపై ప్రభుత్వం భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, కనీస వేతనం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

**అక్టోబర్ 9న రాష్ట్ర సదస్సు**

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అక్టోబర్ 9న హైదరాబాద్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు వెల్లడించారు.

**26న ఛలో ఇందిరాపార్క్**

ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఇందులో భాగంగా అక్టోబర్ 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సీపీఐయూ నాయకులు స్పష్టం చేశారు.

# దళిత మహిళా సర్పంచ్‌పై దాడి ఘటనలో.. ఘనపూర్‌లో వేడెక్కిన రాజకీయం

- నిందితులపై చర్యలు తీసుకోకుంటే వేలాది మందితో రాస్తారోకో
- మున్సిపల్ ఎస్సీ సెల్ హెచ్చరిక

స్టేషన్ ఘనపూర్,అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):



మండలంలోని విశ్వనాథపురం గ్రామ దళిత మహిళా సర్పంచ్ గుర్రం యాదమ్మపై అక్రమ మద్యం విక్రయదారులు కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారనే ఆరోపణలతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటనపై మున్సిపల్ ఎస్సీ సెల్ నాయకులు తీవ్రంగా స్పందించారు. విషయం తెలుసుకున్న ఘనపూర్ మున్సిపాలిటీ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుర్రం ఫాతికుమార్, కమిటీ సభ్యులు ఆదివారం సర్పంచ్ యాదమ్మను కలిసి పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని ఆమెకు సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దళిత మహిళా సర్పంచ్‌ను కులం పేరుతో దూషించి అవమానపరిచి, దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిపై దాడి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే మున్సిపాలిటీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో వేలాది మంది దళితులతో నిరసన ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి తాటికొండ సున్నం యాదగిరి, టౌన్ కార్యదర్శి మాతంగి దేవయ్య, తిరుమలనాథ దేవస్థానం వైస్ చైర్మన్ తాటికొండ యాదగిరి, టౌన్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చేపూరి రమేష్, బాస్కుల రామచంద్రం, సింగపురం ఎల్లేష్, సింగపురం బాబు, గుర్రం వెంకటయ్య, నిరటి రవి, గద్దల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ల కార్పొరేషన్ సాధించాలి

- రెడ్డి జాగృతి నూతన కమిటీలు ఏకగ్రీవ ఎన్నిక

స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):

తమ హక్కుల సాధనతో పాటు రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు కోసం ఐక్యంగా పోరాడాలని రెడ్డి జాగృతి నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో రెడ్డి జాగృతి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా, మండల నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా కరెడ్ల రఘునందన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కిసరి మాధవ్ రెడ్డి, మండల అధ్యక్షుడిగా చల్లా రఘు రెడ్డి, మండల ఉపాధ్యక్షుడిగా నాయ్యం బుచ్చి రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అనంతరం నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ.. రెడ్డి వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, రెడ్డి వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.రెడ్డి జాగృతిని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, తమ హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.



# అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తకు అండగా దాస్యం!

- కేటీఆర్ ఆదేశాలతో నాగరాజు వర్మను పరామర్శించిన దాస్యం వినయ్‌భాస్కర్
- కార్యకర్తకు ఆర్థిక భరోసా కల్పించిన మాజీ చీఫ్ విప్ దాస్యం

వరంగల్, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):



అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్త మూల నాగరాజు వర్మను మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.మడికొండకు చెందిన నాగరాజు వర్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. నాగరాజు వర్మను పరామర్శించి అవసరమైన సహాయం అందించాలని దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఆదేశించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

కేటీఆర్ సూచనల మేరకు దాస్యం వినయ్‌భాస్కర్ నాగరాజు వర్మ నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం నాగరాజు ఆరోగ్య పరిస్థితిపై వైద్యుడితో ఫోన్‌లో మాట్లాడిన వినయ్‌భాస్కర్.. ఆయనకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, పోలేపల్లి రామ్మూర్తి, గంధ్రకోట రాకేష్ యాదవ్, తక్కెళ్లపల్లి వినీల్ రావు, సుధాకర్, తిరుపతి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.





## మల్లన్నగండిలో మళ్లీ విషాదం..

# వీడని మృత్యుఘోష

- స్నేహితుల కళ్లెదుటే నీటిలో గల్లంతైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

చిల్పూర్,అక్టోబర్4(తెలంగాణ ముచ్చట్లు):

సరదాగా గడిపేందుకు స్నేహితులతో కలిసి రిజర్వాయర్‌కు వచ్చిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతైన ఘటన జనగామ జిల్లా నర్మేట మండలం మల్లన్నగండి రిజర్వాయర్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పడాల కళ్యాణ్ (26) ఏడుగురు స్నేహితులతో కలిసి సికింద్రాబాద్ నుంచి మల్లన్నగండి రిజర్వాయర్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు.కళ్యాణ్ నీటిలో గల్లంతవడంతో స్నేహితులు ఆందోళనకు గురై స్థానికులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. గల్లంతైన కళ్యాణ్ ఆచూకీ కోసం స్టేషన్ ఘనపూర్ అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

**వరుస ప్రమాదాలతో ఆందోళన**

మల్లన్నగండి రిజర్వాయర్ వద్ద ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస ప్రమాదాలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ముగ్గురు యువకులు నీటిలో మునిగి మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. రిజర్వాయర్ వద్ద తగిన భద్రతా చర్యలు లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**భద్రత ఎక్కడ..?**

రిజర్వాయర్ అందాలను చూసేందుకు వచ్చే పర్యాటకుల భద్రత కోసం ప్రమాదకర ప్రాంతాల్లో కనీసం హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి అక్కడ పర్యాటకులు నీటిలోకి వెళ్లకుండా కట్టడి చేయాలని, తగిన భద్రతా చర్యలు చేపట్టి మరో కుటుంబానికి కన్నీరు మిగలకుండా చూడాలని వారు అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# ఇంకెన్ని శవాలు తేలితే మేల్కొంటారు..?

- మల్లన్నగండి రిజర్వాయర్ వద్ద ప్రభుత్వ నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ ఆగ్రహం

స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):



మల్లన్నగండి రిజర్వాయర్‌లో వరుసగా ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ ప్రశ్నించారు. ఆదివారం రిజర్వాయర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గల్లంతైన ఘటనపై ఆయన స్పందిస్తూ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి, మరో కుటుంబానికి ఆప్తుడైన వ్యక్తి ఒక్కసారిగా కనిపించకుండా పోతే ఆ కుటుంబాలు పడే వేదన వర్ణనాతీతమని గణేష్ అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే మరో ప్రమాదం జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టడమే అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.

**కనీసం హెచ్చరిక బోర్డు కూడా లేదు**

మల్లన్నగండి రిజర్వాయర్ వద్ద ప్రమాదకర ప్రాంతాల్లో కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం దారుణమని గణేష్ మండిపడ్డారు. రిజర్వాయర్ అందాలను చూసేందుకు వచ్చే యువత ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సరదాగా గడిపేందుకు వచ్చిన యువత ప్రమాదంలో చిక్కుకుంటే వారి కుటుంబాలు జీవితాంతం కన్నీరు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "నిన్నటి వరకు నవ్వుతూ తిరిగిన వ్యక్తి ఇవాళ కనిపించకుండా పోయాడు. మరో తల్లి తన బిడ్డ కోసం, మరో భార్య తన భర్త కోసం కన్నీరు పెట్టే పరిస్థితి రాకముందే అధికారులు మేల్కొనాలి" అని అన్నారు.

మల్లన్నగండి రిజర్వాయర్ వద్ద ప్రమాదాల నివారణకు తక్షణమే హెచ్చరిక బోర్డులు, రక్షణ కంచెలు ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను, రక్షణ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని గణేష్ డిమాండ్ చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని కోరారు.

## ట్యాంక్‌బండ్‌పై అంతులేని విషాదం..

# పుట్టినరోజే చిన్నారికి నూరేళ్లు నిండాయి

హైదరాబాద్, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):

నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిన్నారి పుట్టినరోజు వేడుకల్లో తీవ్ర విషాదం అలుముకుంది. కూతురి జన్మదినాన్ని ఆనందంగా జరుపుకోవాలనుకున్న ఆ కుటుంబానికి శోకం మిగిలింది.

అతివేగంగా దూసుకొచ్చిన లారీ రూపంలో మృత్యువు కబలించడంతో చిన్నారితో పాటు మరో బంధువు ప్రాణాలు కోల్పోయారు.

కూకట్‌పల్లిలోని పీవీఆర్ మాల్‌లో చిన్నారి సరాక్షి (6) జన్మదిన వేడుకల సందర్భంగా కుటుంబసభ్యులు సినిమా చూశారు. మూవీ అయిపోయిన వెంటనే చిన్నారితో కలిసి కేక్ కటింగ్ చేసేందుకు వారంతా ఉత్సాహంగా ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. ట్యాంక్‌బండ్ వద్ద హుస్సేన్ సాగర్ వైపు రోడ్డు దాటుతున్న సమయంలో ఊహించని ప్రమాదం జరిగింది.

అతివేగంగా వచ్చిన లారీ వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో చిన్నారి సరాక్షి (6) అక్కడికక్కడే దుర్మరణం చెందగా, ఆమెతో పాటు ఉన్న మరొక బంధువు కూడా తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోయారు. పుట్టినరోజు ఆనందంలో ఉండాల్సిన కుటుంబం ఈ అకస్మాత్తు ఘటనతో కోలుకోలేని శోకసంద్రంలో మునిగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పాట్‌కు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఓబీసీ కులగణన చేపట్టాలి

- **లేకపోతే ఢిల్లీ దిగ్బంధనమే**
- **దేశవ్యాప్తంగా ఉద్యమానికి పిలుపు**
- **లక్నో సదస్సులో శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక**

**లక్నో, అక్టోబర్ 4 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశవ్యాప్తంగా జనగణనలో ఓబీసీ కులగణనను తప్పనిసరిగా నిర్వహించాలని, లేకపోతే లక్షలాది మందితో దేశ రాజధాని ఢిల్లీని దిగ్బంధించే స్థాయిలో భారీ ఉద్యమాన్ని చేపడతామని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని కస్తూర్బా ఆడిటోరియంలో జాతి జన గణన సంఘర్ష్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓబీసీ జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సదస్సులో ఇండియన్ నేషనల్ లీగ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మహమ్మద్ సులేమాన్, మాజీ ఎంపీ ప్రొఫెసర్ డాక్టర్ రామ్ బక్షి సింగ్ వర్మ, ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ సూరజ్ యాదవ్ మండల్, డాక్టర్ ఈశ్వర్ ధ్యాన్, ఉమేష్ కోర్రం తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఓబీసీ వర్గాలకు సంబంధించిన జనాభా గణాంకాల అవసరంపై విస్తృతంగా చర్చించారు.

ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించి ఓబీసీ కులగణన నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీ సంఘాలు, నాయకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రాల వారీగా పర్యటిస్తూ ఓబీసీ సంఘాలను సంఘటితం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఓబీసీ జనాభాకు సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలు లేకపోవడం వల్ల రిజర్వేషన్లకు సంబంధించిన అనేక అంశాలు న్యాయస్థానాల్లో నిలబడడం లేదని ఆయన పేర్కొన్నారు. కులగణన ద్వారా వచ్చిన గణాంకాలు సామాజిక న్యాయం అమలుకు బలమైన ఆధారంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.

దేశంలో సుమారు ఎనభై కోట్ల మంది ఓబీసీలు ఉన్నారని పేర్కొంటూ, వారికి విద్య, ఉద్యోగాలు, పదోన్నతులు, చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని అన్నారు. ఓబీసీల హక్కుల సాధనకు మద్దతు ఇచ్చే రాజకీయ శక్తులకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

దేశవ్యాప్తంగా అన్ని ఓబీసీ సంఘాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి దశలవారీగా ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించాలని సదస్సులో తీర్మానించినట్లు తెలిపారు. ఓబీసీ కులగణన, రిజర్వేషన్ల అమలుపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే లక్షలాది మందితో ఢిల్లీని దిగ్బంధించే స్థాయిలో ఉద్యమం చేపడతామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.





# కేటీఆర్ సారూ.. బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోరూ!

- **తల్లి, తండ్రిని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఇద్దరు కుమారులు**
- **కుటుంబాన్ని ఆదుకోవాలని కేటీఆర్‌కు విన్నపం**

**హనుమకొండ, అక్టోబర్ 04 (తెలంగాణ ముచ్చట్లు):**

తల్లిదండ్రులను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పార్టీ అధిష్ఠానం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తమ కుటుంబ పరిస్థితిని పరిశీలించి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లి గ్రామానికి చెందిన తాటికాయల సంజీవ కుటుంబం మొదటి నుంచి బీఆర్ఎస్ పార్టీని నమ్ముకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లి తాటికాయల అనిత 2012లో మృతి చెందగా, అప్పటి నుంచి తండ్రి తాటికాయల సంజీవ బీఆర్ఎస్ కార్యకర్తగా కొనసాగుతూ కుటుంబాన్ని పోషించారని పేర్కొన్నారు.



తండ్రి తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ పరిస్థితుల దృష్ట్యా పెద్ద కుమారుడు తాటికాయల సిద్దు తన చదువును మధ్యలోనే నిలిపివేసి టెంట్ హౌస్, డెకరేషన్, డీజే పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించడంతో పాటు తండ్రి వైద్య ఖర్చులను భరించారని తెలిపారు. అయితే దురదృష్టవశాత్తు 2026లో తండ్రి సంజీవ కూడా మృతి చెందడంతో కుటుంబానికి పెద్ద దిక్కు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సిద్దు తమ్ముడు తాటికాయల సాయి పుట్టుకతోనే మానసిక వైకల్యంతో ఉన్నాడని, సొంతంగా ఎలాంటి పని చేసుకోలేని పరిస్థితిలో ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లిదండ్రులు ఇద్దరూ లేకపోవడంతో సాయి సంరక్షణ బాధ్యత కూడా సిద్దుపైనే పడిందని, మరోవైపు అప్పుల భారం పెరగడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం స్పందించి తాటికాయల సంజీవ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని, పెద్ద కుమారుడు సిద్దుకు ఉపాధి కల్పించే మార్గం చూపడంతో పాటు మానసిక వైకల్యంతో ఉన్న సాయి భవిష్యత్తుకు అవసరమైన ఆసరా అందించాలని కుటుంబ సభ్యులు కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.

కష్టాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలకు అండగా నిలిచే పార్టీ నాయకత్వం తమ కుటుంబ పరిస్థితిని కూడా మానవతా దృక్పథంతో పరిశీలించి ఆపన్న హస్తం అందిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నామని తాటికాయల సిద్దు తెలిపారు.




# మందులే ముప్పుగా మారితే.. మానవాళి భవిష్యత్తు ఏమిటి?

- **సీహెచ్. ప్రతాప్**

ఒక చిన్న ఇన్ఫెక్షన్‌కు మందు వేసుకున్నా తగ్గకపోతే? సాధారణ ఆపరేషన్ తర్వాత వచ్చే ఇన్ఫెక్షన్‌కు ఒక్క యాంటీబయాటిక్ కూడా పనిచేయకపోతే? నేటి వైద్య విజ్ఞానం రేపటి రోజున మన చేతుల్లోనే నిస్సహాయంగా నిలబడితే?

ఇది భవిష్యత్తు గురించి ఊహించిన భయానక కథ కాదు. మనం ఇప్పుడే నిర్మించుకుంటున్న ఒక మౌన సంక్షోభం. మనల్ని కాపాడాల్సిన యాంటీబయాటిక్స్‌ను అతిగా, అనవసరంగా వాడటం వల్ల బ్యాక్టీరియా వాటిని ఎదుర్కొనే శక్తిని పెంచుకుంటోంది. ఫలితం——నిన్నటివరకు సులభంగా నయం చేసిన ఇన్ఫెక్షన్లే రేపు ప్రాణాంతకంగా మారే ప్రమాదం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం 2023లో ప్రయోగశాలలో నిర్ధారించిన ప్రతి ఆరు బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్లలో ఒకటి యాంటీబయాటిక్స్‌కు నిరోధకంగా ఉంది. 2018-2023 మధ్య పర్యవేక్షించిన సూక్ష్మజీవి-మందు కలయికల్లో 40 శాతానికి పైగా నిరోధకత పెరిగింది. 2021లో బ్యాక్టీరియా యాంటీమైక్రోబయల్ నిరోధకతకు ప్రత్యక్షంగా 11.4 లక్షల మరణాలు సంభవించగా, మొత్తం 47 లక్షల మరణాలతో సంబంధం ఉన్నట్లు అంచనాలు చెబుతున్నాయి.

ఈ ముప్పును ఎదుర్కోవడంలో వైద్యుల బాధ్యత అత్యంత కీలకం. ప్రతి జ్వరం లేదా ఇన్ఫెక్షన్‌కు యాంటీబయాటిక్ అవసరం ఉండదు. అవసరమైనప్పుడు సరైన మందు, సరైన మోతాదు, సరైన వ్యవధిని నిర్ణయించాలి. సాధ్యమైన చోట పరీక్షలు, స్థానిక నిరోధకత సమాచారం ఆధారంగా చికిత్సను ఎంచుకోవాలి. ఆస్పత్రుల్లో యాంటీమైక్రోబయల్ స్టీవార్డ్‌షిప్ కార్యక్రమాలను బలోపేతం చేయడం కూడా అవసరం. WHO ప్రకారం ఇటువంటి కార్యక్రమాలు మందుల సముచిత వినియోగాన్ని మెరుగుపరచి, నిరోధకతను తగ్గించడంలో సహాయపడతాయి.

ప్రభుత్వాల బాధ్యత కూడా అంతే పెద్దది. యాంటీబయాటిక్స్ విక్రయం, పంపిణీ, నాణ్యతపై సమర్థవంతమైన నియంత్రణ ఉండాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన నిర్ధారణ పరీక్షలు, ఇన్ఫెక్షన్ నియంత్రణ, పారిశుద్ధ్యం, పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలి. దేశవ్యాప్తంగా AMRపై నమ్మదగిన డేటాను సేకరించి, దాని ఆధారంగా విధానాలు రూపొందించాలి. WHO కూడా జాతీయ స్థాయిలో పర్యవేక్షణ, ప్రయోగశాల సామర్థ్యం, సంక్రమణ నియంత్రణ, సముచిత మందుల వినియోగం, పరిశోధన, బహుళ రంగాల సమన్వయాన్ని కీలక చర్యలుగా సూచిస్తోంది.

భారతదేశంలోనూ ఈ దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. ICMR యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్‌ను జాతీయ ఆరోగ్య పరిశోధనలో కీలక అంశంగా గుర్తించింది. 2025 నాటికి ICMR యాంటీమైక్రోబయల్ స్టీవార్డ్‌షిప్ నెట్‌వర్క్ 20 తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో అమలవుతూ, 1.35 లక్షలకు పైగా రోగుల డేటాను సేకరించింది.

అయితే బాధ్యత వైద్యులు, ప్రభుత్వాలతోనే ముగియదు. ప్రజలు కూడా యాంటీబయాటిక్స్‌ను స్వయంగా కొనుగోలు చేసి వాడకూడదు; మిగిలిన మందులను మళ్లీ ఉపయోగించకూడదు; వైద్యుల సూచనలను పాటించాలి. అవగాహన లేకుండా వేసే ఒక్కో మాత్ర భవిష్యత్తులో పనిచేయాల్సిన మందుపై ఒత్తిడిని పెంచవచ్చు.

**మందులు మనిషిని కాపాడటానికి పుట్టాయి.**
**మన నిర్లక్ష్యం వాటినే మానవాళికి ముప్పుగా మార్చకూడదు.**
**మందు పనిచేయని రోజు.. వైద్యం వెనక్కి వెళ్లే రోజు.**
**యాంటీబయాటిక్స్‌ను కాపాడటం అంటే ఒక్క మందును కాదు.**
**మానవాళి భవిష్యత్తును కాపాడటం.**

# ఆడబిడ్డలపై ఆగని అకృత్యాలు

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన బాలిక బంధువులు నిందితుడి ఇంటి వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటనలో దాడులకు పాల్పడిన ఆరోపణలపై కొందరు బంధువులపై కూడా కేసులు నమోదు చేసినట్లు సమాచారం. ఒకే ఘటనలో లైంగిక దాడి యత్నం, ప్రతీకార చర్యలు రెండూ చోటుచేసుకోవడం స్థానికంగా సంచలనంగా మారింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం చిన్నారులపై జరిగే నేరాల్లో ఎక్కువ శాతం పరిచయస్తులే నిందితులుగా ఉండటం మరింత ప్రమాదకర పరిణామంగా మారింది. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు పిల్లల్లో అప్రమత్తత పెంచాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని చిన్నారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

పోక్సో వంటి కఠిన చట్టాలు ఉన్నప్పటికీ నేరాలు పూర్తిగా తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. నేరస్థులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవడంతో పాటు మహిళలు, చిన్నారుల భద్రత కోసం మరింత కఠినమైన పర్యవేక్షణ వ్యవస్థ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలలు, కళాశాలలు, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సామాజిక వర్గాలు కోరుతున్నాయి.

మహిళలు, బాలికల భద్రత కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా సమాజం మొత్తం బాధ్యతగా మారింది. భద్రాద్రి ఘటనలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కుటుంబాలు, విద్యాసంస్థలు, పోలీసులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

ఆడబిడ్డలు భయంలేకుండా బయట తిరిగే పరిస్థితులు కల్పించడమే నిజమైన అభివృద్ధికి కొలమానమని, మహిళలపై నేరాలను అరికట్టడంలో రాజీ లేని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in